క్లుప్తంగా

దరఖాస్తులకు గడువు పెంపు

భామిని: స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు గడువును పెంచినట్లు ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసేందుకు ఈ నెల 31 వరకు గడువు ఉండగా.. దాన్ని ఏప్రిల్ 6 వరకు ప్రభుత్వం పొడిగించిందని పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష యథావిధిగా ఏప్రిల్ 21న ఆయా మండలాల ఏపీ మోడల్ స్కూళ్లలో నిర్వహిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పనుకువలసలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



పాలకొండ రూరల్: కవాతులో పాల్గొన్న ఎస్సై ప్రశాంత్‌కుమార్

పాలకొండ రూరల్: మండలంలోని పనుకువలసలో శుక్రవారం సాయుధ బలగాలు, పోలీసులు కవాతు నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఎస్సై ఎస్.ప్రశాంత్‌కుమార్ కోరారు. ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారి

పాలకొండ: ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎన్నికల సీనియర్ సహాయ అధికారి లక్ష్మీనరసింహ కోరారు. పట్టణంలోని 166, 167 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటు హక్కు వినియోగంపై శుక్రవారం ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎంలపై ఓటు వేసే విధానాన్ని వివరించారు. ఓటు హక్కు ఉన్నవారు పోలింగ్ రోజున విధిగా ఓటు వేయాలని, ఓటింగ్ శాతం పెరిగేందుకు సహకరించాలని కోరారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం

సాలూరు రూరల్: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలోని పెదబోరబంద గ్రామంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో చేసిన సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. గడపగడపలో ఆయనకు ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలు మోసం చేసిన చంద్రబాబునాయుడును ప్రజలు మరోసారి నమ్మే పరిస్థితి లేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎమ్మెల్సీగా ఉన్న సంధ్యారాణి సాలూరు నియోజకవర్గానికి చేసిందేమీ లేదని స్పష్టం చేశారు. జగనన్న పాలనలో గిరిజన గ్రామాలు ఎంతో అభివృద్ధి చెందాయన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మించామని, మౌలిక సదుపాయాలు కల్పించామని అన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

సీతానగరం: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ అన్నారు. మండలంలోని అప్పయ్యపేట, లచ్చయ్యపేట గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న మంచినీటి పథకాల పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలందరూ తాగునీటిని పొదుపు చేయాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పాచిపెంట: మండలంలో కన్నయ్యవలస, చిట్టెలబ, మిలియకంచూరు, బొర్రమామిడి తదితర గ్రామాల్లో రూరల్ సీఐ బాలకృష్ణ, ఎస్సై నారాయణరావు శుక్రవారం పర్యటించారు. పోలింగ్ కేంద్రాలను పరిశీలించి అక్కడి వసతులపై ఆరా తీశారు. ఓటు హక్కును అందరు వినియోగించుకునేలా ప్రజలను చైతన్యం చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

మక్కువ: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని ఎస్సై పి.నరసింహమూర్తి కోరారు. మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో శుక్రవారం ఎస్టీఎఫ్ బలగాలతో కలిసి ఏరియా డామినేషన్, ఆర్‌ఓపీ(రోడ్డు ఓపెనింగ్ పార్టీ) కార్యక్రమం నిర్వహించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో కల్వర్టులు, అనుమానిత ప్రదేశాలను తనిఖీ చేశారు. ఎక్కడైనా సారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తున్నారా అని నిశితంగా పరిశీలించారు. ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించడంతో పాటు, ప్రజలకు ఎన్నికల కోడ్, ఓటు హక్కు ఆవశ్యకత, వినియోగంపై అవగాహన కల్పించారు.

ప్రజారోగ్యానికి భరోసా..

జియ్యమ్మవలస మండలం చిన్నటౌన్ మండగూడ గ్రామానికి చెందిన దేవి మునగచెట్టు ఎక్కి మునగకాడలు తీస్తుండగా కింద పడిపోవడంతో రెండు చేతులు విరిగిపోయాయి. సీతంపేట ఏరియా ఆస్పత్రిలో వైద్యం బాగుటుందని తెలుసుకుని ఆస్పత్రిలో చేరింది. పది రోజుల కిందట వైద్యులు ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అబ్జర్వేషన్‌లో ఉంచారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగుపడింది.

భామిని మండలం బిల్లుమడ గ్రామానికి చెందిన విద్యార్థి రవీంద్ర పాఠశాలలో ఆడుకుంటూ కింద పడిపోవడంతో ఎడమచేయి విరిగిపోయింది. వెంటనే సీతంపేట ఆస్పత్రిలో చేరిన అతనికి ఇక్కడి వైద్యులు వారం రోజుల కిందట ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎంతోమంది సీతంపేట ఏరియా ఆస్పత్రిలో చికిత్స తీసుకుని త్వరగా కోలుకుంటున్నారు.



సీతంపేట ఏరియా ఆస్పత్రి

- సీతంపేట ఏరియా ఆస్పత్రిలో రెట్టింపైన వైద్య సేవలు
- అందుబాటులో అధునిక వైద్య పరికరాలు
- వార్డుల్లో మౌలిక వసతులు
- రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అప్‌గ్రేడ్
- మరో రూ.20 కోట్లతో అదనపు భవనాల నిర్మాణం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దేవి

సీతంపేట: గత ప్రభుత్వ హయంలో సర్కారీ వైద్యానికి జబ్బు చేస్తే.. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులకు చికిత్స చేస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో మరింత మెరుగైన వసతులు, వైద్య పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రభుత్వ ఆస్పత్రులు ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్నాయి. దీనికి నిదర్శనం స్థానిక ఏరియా ఆస్పత్రిలో అందిస్తున్న వైద్యసేవలే. ఖరీదైన శస్త్ర చికిత్సలు కూడా పైసా ఖర్చు లేకుండా చేస్తున్నారు. గత ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుతం వైద్య సేవలు రెట్టింపు అయ్యాయి. గతంలో రోజుకు ఓపీ సగటున 50 లోపే ఉండేది. ఇప్పుడు 150కి తగ్గకుండా ఓపీ నమోదవుతోంది. అన్ని రకాల స్పెషలిస్టు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫిజియోథెరపిస్టు, గైనాకాలజిస్టులు, ఎనస్తీషియన్, సివిల్ సర్జన్, జనరల్ ఫిజీషియన్, దంత వైద్యులు, ఈఎన్‌టీ వైద్యులు సేవలందిస్తున్నారు. అన్ని రకాల రక్త పరీక్షలు చేసే పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రూ.20 కోట్లతో ఈ సీహెచ్‌సీసీ అప్‌గ్రేడ్ చేస్తున్నారు. దీనిలో ఆపరేషన్ థియేటర్లు, బ్లడ్‌బ్యాంక్ వంటివి ఏర్పాటు చేశారు. రూ.50 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

వైద్యసేవలు బాగున్నాయి



గతంలో కంటే ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యసేవలు బాగున్నాయి. సుదూర ప్రాంతాల నుంచి కూడా ఇక్కడకు వచ్చి వైద్యసేవలు పొందుతున్నారు. మేం దాదాపు రెండు వారాలుగా ఇక్కడే ఉంటున్నాం. అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. – గంగారం, రోగి బంధువు

ఎన్‌ఆర్‌సీ యూనిట్‌తో చిన్నారులకు పోషకాహారం..
స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఎన్‌ఆర్‌సీ(న్యూట్రీషియన్ రిహిబిలిటేషన్ సెంటర్) ద్వారా పోషకాహార లోపంతో బాధపడుతున్న చిన్నారులను ఇక్కడ ఉంచి ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. గ్రామాల్లో బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి ఇక్కడ చేర్పించి న్యూట్రీషియన్‌తో కూడిన ఆహారాన్ని అందించి బరువు పెరిగిన తరువాత ఇంటికి పంపిస్తున్నారు. ఇక స్పెషల్ న్యూ బోర్న్ కేర్ యూనిట్ ద్వారా అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ప్రత్యేక వైద్యం అందుతోంది. ఫోటో థెరపీ, సీప్యాప్, వార్మర్లు, వెంటిలీటర్లు వంటి సౌకర్యాలు ఉన్నాయి.



నూతనంగా నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

రాయగడ జమ్ములో పశువైద్య శిబిరం

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రాయగడ జమ్ము గ్రామంలో పశుసంవర్ధక శాఖ, నాబార్డ్ జీవ ప్రాజెక్ట్(జట్టు సంస్థ) సంయుక్తంగా శుక్రవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువులకు సీజనల్‌గా వచ్చే వ్యాధులు, లక్షణాలు, నివారణ చర్యలపై పశువైద్యాధికారి పి.లక్ష్మణరావు పాడిరైతులకు అవగాహన కల్పించారు. వేసవి నేపథ్యంలో పశువులు తాగేందుకు నీరు అందుబాటులో ఉండేలా చూడాలని, శాలలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో జీవ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ జి.ప్రబోధ్, జి.మురళీమోహన్, తదితరులు ఉన్నారు.



పశువ్యాధులపై సూచనలు చేస్తున్న వైద్యాధికారి

నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించాలి



స్వీట్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంతో పాటు ఎల్విన్‌పేట గ్రామాల్లో డిస్ట్రిక్ట్ ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ రామయ్య శుక్రవారం పర్యటించారు. స్వీట్ షాపులు, బేకరీ షాపుల వద్దకు వెళ్లి ఆహార పదార్థా నాణ్యతను, దుకాణాల లైసెన్స్‌లను పరిశీలించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అభివృద్ధి బాట

కురుపాం: గ్రామాల అభివృద్ధికి రహదారులు ఎంతో కీలకం. రోడ్లు ఉంటే విద్య, వైద్యం, ఇతర సౌకర్యాలు ప్రజలకు చేరువవుతాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. గత టీడీపీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రహదారుల నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసింది. దీంతో చాలా గ్రామాలు అభివృద్ధికి దూరమయ్యాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామీణ రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించింది. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి మారుమూల గ్రామాలకు రోడ్లు వేసింది. ఇందులో భాగంగా రూ.2 కోట్లతో మూలిగూడ నుంచి బీరుపాడు గిరిజన గ్రామానికి బీటీరోడ్డు నిర్మించారు. రోడ్డు అందుబాటులోకి రావడంతో ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి ఆర్టీసీ అధికారులతో మాట్లాడి మండల కేంద్రం నుంచి బీరుపాడు గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించారు. ప్రయాణ కష్టాలు తీరడంతో ఏజెన్సీ గ్రామాల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



అధ్వానంగా ఉన్న బీరుపాడు రహదారి



రూ.2 కోట్లతో మూలిగూడ నుంచి బీరుపాడు గ్రామానికి నిర్మించిన రహదారి

పంచ కుల వృత్తులను చేదోడులో చేర్చాలి



సమావేశంలో పాల్గొన్న పంచకుల వృత్తిదారులు

భామిని: మండలంలోని బాలేరులో విశ్వబ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆగూరు సంజీవ్ ఆచారి అధ్యక్షతన శుక్రవారం పంచకుల వృత్తిదారుల సమావేశం నిర్వహించారు. చేతి వృత్తులే ఆధారంగా జీవించే విశ్వబ్రాహ్మణులకు ప్రభుత్వం నుంచి తగిన గుర్తింపు, ప్రోత్సాహం అందలేదని విశ్వబ్రాహ్మణ సేవా సంఘం తీర్మించింది. పంచ కుల వృత్తులు చేస్తూ జీవనం సాగిస్తున్న వారికి వైఎస్సార్ జగనన్న చేదోడు పథకంలో చేర్చాలని, కుల వృత్తులకు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని కోరారు. మండల సంఘ నాయకులు ఆగూరు కృష్ణ, సింహాద్రి రమేష్, రీసి శంకర్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

నేడు పలు పంచాయతీల్లో ఎమ్మెల్యే ప్రచారం

వీరఘట్టం: మండలంలోని నడిమికెల్ల, విక్రమపురం, కంబరవలస, నడుకూరు పంచాయతీల్లో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శనివారం ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే కళావతికి జన నీరాజనం



సంత-నర్శిపురంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

- పలు గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం
- హారతి ఇచ్చి స్వాగతం పలికిన మహిళలు



అవ్వా.. పింఛన్ అందుతుందా అంటూ వృద్ధురాలిని ఆరా తీస్తున్న ఎమ్మెల్యే కళావతి



సంత-నర్శిపురంలో ఎమ్మెల్యే కళావతికి నుదుట తిలకం దిద్ది స్వాగతం పలుకుతున్న మహిళ

వీరఘట్టం: మండలం సంత-నర్సిపురంలో శుక్రవారం ఎమ్మెల్యే విశ్వసరాయి కళావతి ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. గ్రామానికి మహిళలు నీరాజనాలు పలుకుతూ, హారతులు పడుతూ విజయతిలకం దిద్దారు. గ్రామంలోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ ప్రతి ఒక్కరినీ పలకరిస్తూ ముందుకు సాగారు. ఐదేళ్లలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. అంతకుముందు సంత-నర్సిపురం గ్రామ ఇలవేల్పు సంతోషిమాత ఆలయంలో ఎమ్మెల్యే కళావతి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామానికి చెందిన మహిళలు కోలాట ప్రదర్శనలతో కళావతికి ఘన స్వాగతం పలికారు. అనంతరం మహదేవివలస, దశమంతపురం, చలివేంద్రి, బూరగ గ్రామాల్లో ఇంటింటా ప్రచారం చేశారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయాలని కోరారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి..
రాష్ట్రంలో సచివాలయ, వలంటర్ వ్యవస్థలు కొనసాగాలన్నా.. పేదలకు న్యాయం జరగాలన్నా.. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే రావాలని, మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే కళావతి అన్నారు. 2014 ఎన్నికలకు ముందు 614 హామీలు ఇచ్చిన చంద్రబాబు వాటిలో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. టీడీపీ చెప్పే అబద్ధపు హామీలను ప్రజలు నమ్మవద్దని కోరారు. మీకు మేలు జరిగితేనే వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని ఎమ్మెల్యే కళావతి కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దమలపాటి వెంకటరమణ నాయుడు, జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కర్రి లీలాప్రసాద రావు, సర్పంచ్‌లు కర్రి సత్యవతి, వావిలపల్లి ఉషారాణి, బవిరి సుదర్శనరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కర్రి గోవిందరావు, ఎంపీటీసీ పోరెడ్డి వెంకటనాయుడు, వావిలపల్లి హరిబాబు, సన్యాసినాయుడు, సాదు గోవిందరావు, చింత సింహాచలం, గంట జగన్నాథరావు, చింత ముకుంద, కొట్నాన సోమినాయుడు, కర్రి విశ్వేశ్వరరావు, కర్రి పాపినాయుడు, అలజంగి విశ్వేరరావు, మిడితాన కళ్యాణి, కుద్దిగాన వెంకటరమణమూర్తి, వైస్ ఎంపీపీ పత్రి విజయకుమారి, పాలకొండ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు, పాలమెట్ట సర్పంచ్ ఉదయాన జగన్‌మోహనరావు, మండల కో-ఆప్షన్ సభ్యుడు వైశ్యరాజు గోవిందరాజు, భోగి మణి, అమర్‌నాథ్, నీలం సత్యంనాయుడు, చందక వెంకటరమణ, మెరుగుల చంద్రమౌళీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న శత్రుచర్ల పరీక్షిత్‌రాజు, తదితరులు

కొమరాడ: మండలంలోని చినఖేర్జిల గ్రామంలో కేంద్రగల రవికుమార్(గిరి) సంబంధించిన పూరిల్లు గురువారం అగ్నికి ఆహుతయ్యింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందించడంతో పాటు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ఆయన వెంట పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, వైస్ ఎంపీపీ నంగిరెడ్డి శరత్‌బాబు, కొమరాడ, శివిని పీఏసీఎస్ చైర్మన్లు మరడాన సూరపనాయుడు, పప్పల గోపాలకృష్ణ, మండల సచివాలయ కన్వీనర్ యేగిరెడ్డి సింహాచలం, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, శెట్టి మధుసూదనరావు, తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న పుచ్చకాయల అమ్మకాలు

గరుగుబిల్లి: మార్చి నెలలోనే ఎండలు ఠారెత్తిస్తున్నాయి. ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు శీతలపానీయాల వైపు చూస్తున్నారు. ఆరోగ్యానికి మేలు చేసే కొబ్బరి నీరు, వాటర్ మిలన్, తదితర పండ్లు, పండ్ల రసాలను తీసుకునేందుకు ఆసక్తి ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కర్బూజాలు పోగులుగా పోసి విక్రయిస్తున్నారు. అందుబాటు ధరల్లో లభ్యమవుతుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు ఎగబాకుతున్నారు. మండలంలోని ఖడ్గవలస జంక్షన్, రావివలస జంక్షన్, ఎర్రన్నగుడి జంక్షన్, గరుగుబిల్లి వద్ద కర్బూజాల అమ్మకాలు జోరందుకున్నాయి.



ఎర్రన్నగుడి జంక్షన్ వద్ద అమ్మకానికి ఉంచిన పుచ్చకాయలు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

పాలకొండ, కురుపాం నియోజకవర్గాల్లో క్రీస్తు విశ్వాసకులు భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేని జరుపుకున్నారు. శుక్రవారం ఉదయం నుంచి చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రీస్తును స్తుతిస్తూ కీర్తనలు ఆలపించారు. మానవులను పాపాల నుంచి విముక్తలను చేసేందుకు ఏసుక్రీస్తు శిలువ వేయబడిన రోజును గుడ్‌ఫ్రైడేగా జరుపుకుంటారు. ఈ ఇతివృత్తాన్ని తెలియజేస్తూ ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు. బైబిల్‌లోని క్రీస్తు సందేశాన్ని మతపెద్దలు విశ్వాసకులకు వినిపించారు. వీరఘట్టం మండలంలోని తూడి చర్చ్ వద్ద నిర్వహించిన ప్రార్థనల్లో ఎమ్మెల్యే కళావతి పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సీతంపేట: శిలువయాత్రగా ఫాతిమా మాత పుణ్యక్షేత్రానికి వెళ్తున్న క్రైస్తవులు



పాలకొండ రూరల్: పట్టణంలో క్రీస్తు స్లీవ మార్గ యాత్రలో పాల్గొన్న విశ్వాసకులు, ప్రజలు



వీరఘట్టం: తూడి వద్ద గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కళావతి



గరుగుబిల్లి: గరుగుబిల్లిలో గుడ్‌ఫ్రైడే ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు



కురుపాం: సమారిటన్ లూథరన్ చర్చిలో ప్రార్థనలు చేస్తున్న విశ్వాసులు



గుమ్మలక్ష్మీపురం: శిలువపై క్రీస్తు వేషధారణలో ఉన్న వ్యక్తిని ఊరేగిస్తున్న దృశ్యం



భామిని: బత్తిలిలో శిలువ యాత్ర..



భామిని: ప్రేమగిరి వద్ద శిలువ యాత్రలో పాల్గొన్న నల్లరాయిగూడ విశ్వాసకులు